

# కైంకర్యమ్

మల్లాది రామకృష్ణశాస్త్రి

వెంకటస్వామి, ఎన్నడో నా చిన్నతనంలో గోదావరిజిల్లానుంచి, మా ఊరు తమలపాకులబేరానికి వచ్చాడు. క్రమంగా, నోటిమంచితనాన,- చేతిమంచితనాన అక్కడే స్థిరపడిపోయి, మాంచి ప్రయోజకుడై వ్యాపారం, వచ్చినప్పటికన్న చాలా భారీఎత్తున సాగించుతున్నాడు:

అది, పేరుకు కిళ్లీకొట్టేగాని, సబ్బులూ తలనూనెలూ, ఆడవాళ్ల అల్లిక సూదులూ, ఇలా ఒకటేమిటి చప్పన్నపదార్థాలూ దొరుకుతాయి;ఊళ్లో ఏ కారుకు ఆకారు ఏదో రూపేణా ఆ దుకాణంతో అవసరం ఉండనే ఉంటుంది: అక్కడ దొరికే సోడా ఊరుమొత్తంమీద ఎక్కడా దొరకదు: ఇక వెంకటస్వామి కిళ్లీ అంటే, జగత్ప్రసిద్ధి- కాంగ్రెస్ మంత్రుల్లో కొంతమంది అక్కడికి విచ్చేసినప్పుడు, దాన్ని సేవించడమూ, స్వదస్తూరిన యోగ్యతాపత్రాలు ప్రసాదించడమూ కూడా జరిగింది: వాటన్నింటికీ చక్కని ఫ్రేములు కట్టించి, నలుగురి కంటాపడేటట్టు కొట్లో అమర్చాడు:

వెంకటస్వామి, పచ్చి కాంగ్రెస్‌వాది: ఖద్దర్ తప్ప, మరోటి ఏదీ కట్టడు: కట్టక పోవడమే కాదు- కొట్లో అవసరాలకన్నా మరో గుడ్డ వాడడు- తమలపాకులు తుడవటానికీ, కొట్లో దుమ్ముదులపడానికీ.- ఎందుకైనా శుద్ధఖద్దరే!

ప్రొద్దున్నే కొట్టు తెరిచీతెరవడంతోనే మహాత్ముడి బొమ్మకు ఆరతి ఎత్తుతాడు: తతిమ్మా ప్రముఖ దేశనాయకుల పటాలకీ యథాశక్తి చెయి చూపించి, ఒకటో అరో పువ్వు ప్రతిపటం నెత్తినా పెచ్చుతాడు: ఆ కలాపం అంతా అయితేనేగాని బేరం యివ్వడు:

ఎక్కడ కాంగ్రెస్ మీటింగైనా నడుంకట్టుకు ఉరుకుతాడు: కాంగ్రెసువారు చందాకంటూవస్తే తృణమో పణమో సమర్పించుకోకుండా ఉండడు. వెంకటస్వామి, అంతే కాదు, మంచి మనిషి, మర్యాదస్థుడు.

ఇలాంటి వాడిని, - ఉన్నట్టుండి పోలీసులు అరెస్టుచేసి తీసుకుపోయినారని, కొట్టాంతా సోదా చేసి కొంత దొంగదినుసుకూడా పట్టుకున్నారనీ - ఓవాడు, తెల్లవారే సరికి ఊరంతా గుప్ మన్నది. ఎవరికీ నమ్మ శక్యం కాకుండా ఉన్నది.

నిషేధం అమలులోకి వచ్చినప్పటినుంచీ, అక్కడక్కడ సోడాకాయల ధరలు విపరీతంగా పెరిగిపోయినాయి. కొన్ని దుకాణాల్లో, వాడిక అయిన వాళ్ళకు గుట్టు చప్పుడు కాకుండా. మాంచి ఘాటైన రూపాయి సోడాలు దొరుకుతున్నాయి. అలాంటివి అడపా దడపా గుట్టు బెడిసి బట్టబయలౌతున్నాయ్. కాని, - వెంకటస్వామి ఏమిటి, - ఇందుకు ఒడిగట్టడమేమిటి? - ఉన్నట్టుండి, ఇంతకాలంనుంచీ లేనిది, ఇప్పుడే పాపిష్ఠి సంపాదనకు అవసరం ఏం వచ్చింది? - ఉన్న సంపాదన అతనికి ఎక్కడక్కా కాగా, ఏదో దానం - ధర్మం అంటూ కూడా చేస్తూంటాడే!—ఎందుకు ఇలా విపరీతపుబుద్ధి పుట్టింది?

రిమాండ్‌లో ఉండగా ఎందరో ఎన్నివిధాలో కదిపి చూశారు, మనిషి ఏమన్నా బయట పడతాడేమోనని! ఊహుఁ,—వెంకటస్వామి, చిరునవ్వు తప్ప, ఎవరడిగినా ఏమీ సమాధానం ఇవ్వలేదు:

మేజస్ట్రేటు దగ్గిర కేసు విచారణకువచ్చింది. ఆపూట ఊరు ఊరంతా అక్కడే ఉంది. ఇప్పుడన్నా వెంకటస్వామి ఏదో ఒక సమాధానం చెప్పి తీరవలసిందేగా!-

ఆ కోర్టులో, న్యాయపీఠం వేసుకున్న అధికారి మొదలు, హాజరు అరిచే డవాల్తీ వరకూ, అందరూ వెంకటస్వామి కొట్లో తరుచు దాహం తీర్చుకునే వారే- తాంబూలం పుచ్చుకునేవారే- ఇచ్చింది పుచ్చుకుని, కొసరు అడిగి నములుతూ,- పలుకరించి లోకాభిరామాయణంలోకి దిగేవారే- అందరికీ వెంకటస్వామి, కావలసినవాడే,- తల్లో నాలికే !-

నేరం రుజువు అయేవరకూ, ముద్దాయి పెద్ద మనిషిక్రిందే జమ- అని ధర్మకాండ సుసూత్రాలలో ఒకటిట !- బోనుదగ్గరకు జేర్చేటంతవరకూ, అందరూ వెంకటస్వామిని మర్యాదగానే చూస్తున్నారు. బోనెక్కి వాఙ్మూలం యిస్తూన్న నిషేధపు-ఇన్స్పెక్టరు సహితం, నిందితుడిని ఉదాహరించడంలో మాటఏమాత్రమూ పొల్లుపోకుండానే తన భోగట్టా యావత్తూ కోర్టువారికి శ్రుత పరిచాడు-

మేజస్ట్రేట్ అంతా విని,-వెంకట స్వామిని పరకాయించి-

'చెప్పినదంతా విన్నావు కదా. ఇందుకు ఏమంటావ్?-'అని బ్రతిమాలుతున్నట్టు అడిగాడు. వెంకటస్వామి చిరునవ్వుతో, పెదవి విప్పకుండా ఊరుకున్నాడు:

'మద్యపాననిషేధ చట్టంక్రింద నీవు నేరం చేసినట్టు సాక్ష్యం అంతా విన్నావుకదా. నీవు చెప్పవలసినది ఏమన్నా ఉంటే నిర్భయంగా చెప్పుకోవచ్చు-'

ఇందుకూ వెంకటస్వామి ఏమీ మాట్లాడలేదు:

'నీవు ఇలా మౌనంగా ఉండటం, నేరాన్ని అంగీకరించినట్టు పరిగణింపబడుతుంది. నీవు మనవి చేసుకోలేకపోతే-నీతరఫున వాదించేందుకు ఎవరికైనా వకాల్తీ యివ్వు. వాయిదా యిస్తాను-'

మేజస్ట్రేట్ ఇంకా సాయలాపాయలాగానే చెపుతున్నాడు-చిరాకు పడుతున్నా-

'నాకు వకీలెందుకండీ! - నేను వాదించేదేముంది బాబూ-మీ సమక్షంలో నాకుఅన్యాయం ఎందుకు జరుగుతుందీ ?—కేసు తప్సీళ్ళనీ పరిశీలించి- తప్పు రుజువైతే — దండించండి -' వెంకటస్వామి యిలా అనే టప్పటికి కోర్టు యావత్తూ ఒక్కుమ్మడిగా తెప్పరిల్లింది - అందరికీ ఎందుచేతనో పల్లమాలిన ధైర్యం వచ్చింది-

మేజస్ట్రేట్కూడా అతి ప్రసన్నంగా 'నేను అడిగే ప్రశ్నలకి సమాధానంచెప్పు వెంకటస్వామీ!' అంటూ ప్రశ్నించినట్టు పలుకరించాడు.

వెంకటస్వామి, వినయంగా, తలవొగ్గి — 'అలాగే బాబూ - సెలవియ్యండి!-' అన్నాడు:

ప్రశ్నలూ జవాబులూ ప్రారంభమైనాయి-

'ఈ సీసాలన్నీ నీవేనా ?-'

'అవును !'

'దొంగ సారాయి వ్యాపారం నేరమని నీకు తెలుసును గదా !'

'తెలియకేం బాబూ !-మునుపైనా, ప్రభుత్వానికిచెల్లించే ముడుపు ఎగవేసి దొంగవ్యాపారం చేయడం నేరమే-ఇప్పుడు దొరతనంగానైనా అమ్మడానికి వీల్లేదాయెను !-'

'నీకు ఈ సరుకు ఎక్కడిది?'

'సొంతం బాబూ!- నేనే బట్టీపెడుతున్నాను. మరొకరికి ఆవాటం చేతకాదు: మన దగ్గిర ఏ సరుకూ నాసిది ఉండదు కదా !—'

విన్న వాళ్ళందరికీ, వెంకటస్వామికి తప్పక మతిపోయి ఉండాలని నికరం అయింది: ఎన్నడూ ఏ అవకరానికీపోని మనిషి ఇప్పుడు ఇందులోకి దిగడమేమిటి?- లోకం పారజూసి, అనువుగా మెలగనేర్చిన మనిషి, గుంజాటన లేకుండా, చేసిన అపరాధం ముక్కుకు సూటిగా ఒప్పేసుకోవడం ఏమిటి?- ఎంత తెలివిమాలిన వాడైనా, వెనుకా ముందూ పారజూడకుండా ఇలాంటి వాటికి దిగడే,- దిగినా, లక్షకాపులు ఉంచుకుని కంఠంమీదికి తెచ్చుకోకుండా మెలుగుతాడే?- ఇతగాడు ఇలా ఈ ఊబిలో దిగబడి పోయినాడేం !-

ప్రతివాడికీ, తల తీసేసినంత పని అయింది. 'ఇన్నాళ్ళనుంచీ, కళ్ళు మూసుకుని నేను మడిగట్టుకున్న వాణ్ణి నమ్మారుకదా,- చూసుకోండి, మీ తెలివి ఎలా తెల్లవారిందో !-' అని ప్రతివాణ్ణీ, వెంకటస్వామి కంట్లో వేలుపెట్టి పొడిచినట్లు అనిపించి, ఎవడి తెలివితక్కువకు వాడే మనసులో కత్తి నూరుకున్నాడు- కోర్టును కమ్మిన మొత్తం చూపులు రంపకోతగా వెంకటస్వామిని రాచుకుంటున్నాయ్- అతడుమాత్రం, ఎప్పటి నవ్వే నవ్వుతున్నాడు.

ఆనవ్వు,-మునుపైతే, మామూలు మర్యాదలో జమ: ఇప్పుడు,-ఇన్నాళ్ళనుంచీ చులాగ్గా అందరినీ పట్టి వెధవాయల క్రిందకట్టి, చలాయించుకు

పోయిన దేవాంతకంగా ఆసలు గుట్టు వెళ్ళబోసుకుంటూంది:

కోర్టు ఒక్క నిమిషంసేపు పరమ - నిశ్శబ్దంగా ఉంది. మేజిస్ట్రేట్ శిక్షవిధించడానికి, - కాగితం మీద పెట్టింది చదవడానికి, గొంతు సవరించుకున్నాడు. ప్రాసిక్యూషన్ తతంగం నెగ్గించిన ఇన్స్పెక్టరుకు, జయించామన్న సంతోషమూ, - ఇదే మొదటి కేసూ, పట్టు పడ్డవాడు, మన వెంకటస్వామి అనే విచారమూ - నవ్వాలో ఉసూరుమనాలో తెలియని తిక - మకగా ఉంది:

'...ఫలానా సెక్షన్, ఇన్నో క్లాజు దాఖలా నీవు నేరము చేసినట్టు రుజువైనందువా, -" మేజిస్ట్రేట్ గొంతున పచ్చి వెలగకాయ చిక్కుకున్నట్టు మాటలు కొరబోతున్నాడు:

'అయ్యా! — నాదో మనవి ఉంది!' వెంకటస్వామి, కాంగ్రెస్‌కు జయకొట్టే గొంతు ఎత్తాడు. మేజిస్ట్రేట్ చేతనున్న దండ శాసనం మేజామీదకు ఆన్చి సులోచనాలు, ఎగసన త్రోసుకుని, - యిటు చూసి, - మౌనంగా పంకించాడు - ఇన్స్పెక్టరు, ఉలికిపడి, యాందాలాభంగా లేచి నిలుచుని, ఎదుటి అధికారి కంట బడ్డప్పుడు సలాం కొట్టే సన్నాహమల్లే కాళ్లు ఘట్టించి - అంతలో తెప్పరిల్లి, నిలుచున్నది తాను కాదన్నట్టు చదికిలపడ్డాడు. కోర్టు అంతటా మాటలు స్ఫుటంగా వినరావడం లేదు కాని, అందరూ కలిపి గబగబా కూడబలుక్కుంటూన్నట్టు చెవికి అందని ఏదో రొదగా ఉంది. వెంకటస్వామి మాటతో, మళ్లీ మౌనం కమ్మేసుకున్నది.

'నేను చేసిన నేరమేమిటో- సెలవిస్తారా?'

కోర్టు యావత్తూ ఆశ్చర్యపడ్డది. ఉన్నట్టుండి, అంతా అయిపోయిన తరువాత యిప్పుడు అడ్డు పేచీ గుప్పించాడేం?- ఈ తెలివి, ముందరే ఏమైంది?

'చేసింది చాలక మళ్లీ ఓట్రిస్తావేం. నువ్వు, దొంగసారాఅమ్మడం లేదూ?-' మేజిస్ట్రేట్ కుటుంబ కలహంలో పాల్గొంటూన్నట్టు గొంతుఎత్తాడు.

'అని, ఎవరన్నారు బాబూ?'

'రుజువైందిగా!'

'ఎలా బాబూ!- అది సారా అని రుజువెలా?-'

మేజిస్ట్రేట్ ఏం మాట్లాడలేదు. ఇన్స్పెక్టరు ఉరికినట్టు లేచి నిలుచున్నాడు.

'అది సారాయే సార్!' అని ఘోషించాడు.

'ఏమిటి నిదర్శనం బాబూ!- మాగిన వాసన వస్తూందనా?- కొన్ని చవకరకం సెంట్లు చెడిపోతే- అలాగ్గానే ఉంటాయి. బాబూ, మీకు గాని, మేజిస్ట్రేటు వారికిగాని, ఆసరుకు గుణం కని పెట్టే అభ్యాసం ఉన్నట్టు నేను ఎన్నడూ విన లేదు. పాతకాపు కెవరికన్నా పట్టిమాడండి- అవునంటే- నేను అనేది ఏముందీ!'

కోర్టు మొత్తంమీద, త్రాగుతానని ముందుకు వచ్చినవాడు ఒక్కడు లేడు: పోలీసుశాఖ ఊరంతా గాలించి ఎవరినో ఓ తలకు మాసినవాడిని బ్రతిమాలుకుని ఓ గంటసేపటికి హాజరు పెట్టింది: వాడు ఓసీసా గుటగుటా త్రాగి- 'ఊహుఁ- ఇది సారాకాదు: ఇంతనిప్పంటి సరుకు కల్తీలేకుండా నేనుపుట్టి బుద్ధెరిగిన తరువాత చూడలేదు- కడుపులో చల్లగా ఉంది. నిదరొస్తూంది-' ఇలా అంటూనే వాడు తూలుతూ తూగుతూ, అక్కడే నిద్రపోయినాడు. బండనిద్ర పోతున్నాడు. ఎంత కొట్టుకున్నా లేవడు. వాడిని అలాగే ఆస్పత్రికి పంపించివేశారు:

అది సారా కాకపోతే,- మరో యింగ్లీషు పేరున్న పదార్థం ఏమన్నానా?- అదిఅలవాటున్న పెద్దమనుష్యులు గొంతారా పరీక్ష చేసి,- ఉండవలసిన సద్గుణములన్నీ ఉన్నాయి కాని- ఇదమిత్థమని మటుకు ఖండితంగా చెప్పలేమన్నారు:

ఇలా కాగాకాగా, చేసేదిలేక, విచారణ వాయిదా వేసి,- మిగిలిన ఒక్కసీసా పరిశోధన నిమిత్తం ప్రభుత్వమువారి నిపుణుడికి పట్నం పంపించివేశారు:

వెంకటస్వామి జామీనుమీద విడుదలచేద్దామా వద్దాఅనే ఆలోచనలోనే ఉంటూండగా మూడోనాటికల్లా పట్నంనుంచి మేజిస్ట్రేట్‌కు తంతి వచ్చింది: కేసు కేంద్రప్రభుత్వానికి వప్పగింత చేయడమైందని- కనుక విచారణ యావత్తూ బర్తరఫుచేసి, సదరు నిందితుడిని కఠిన నిర్బంధంలో ఉంచవలసిందనీ- ఎవరితోనూ మాట్లాడనియ్యవద్దనీ-

ఈ ఉత్తరువులు యిక్కడి అధికారులకు ఎవరికీ అర్థంకాలేదు: వివరణకోసం పైకి మనవిచేసుకున్నారు- జవాబులేదు. కాని మూడోనాటికల్లా అటు ఢిల్లీనుంచి, కొందరు పెద్ద ఫాయా

అధికారులూ బందోబస్తుకోసం,- మామూలు దుస్తులలోనే ఉన్న మరో కోర్జం మందీ, వ్యోమ మార్గానవచ్చి వ్రాలారు.

స్థానిక అధికారులకు యిదంతా చూడగా మండుకువచ్చింది. తాము పట్టుకున్న కేసు, తమ చేజేతులారా రుజువు చేయబోతున్న కేసు,-పైవాళ్లు ఇలా ఎగదన్నుకు పోవడం ఏమిటని !- 'అది కాద య్యా ఈ నేరానికి జపానుకూ సంబంధం ఉంది: ఈ మత్తుపదార్థం జపాను తయారీ అని నిపుణులు తేల్చారు: ఇలా ఎన్ని చోట్లకు యిది వ్యాపించిందో జపాను గూఢచారులు దేశంలో ఎల్లా నిగూఢంగా,- ఏయే మాసికలు వేస్తున్నారో- ఇది, కీలకం- ఈ తీగె కదిలించి డొంకంతా కదపాలి- వీడిచేత, గూఢచారుల ఆరాలు పలికించాలి - పట్టుకోవాలి. దేశం మొత్తంమీద చిక్కం విసిరి, ఉచ్చులు చేతపట్టుకు కూర్చుంది మన ప్రభుత్వం-' అంటూ ఓ పై అధికారి, విసుక్కుంటున్నట్టు జబ్బ చరుచుకుంటున్నట్టు, ఆంతర్యం వెల్లడించాడు స్థానిక దండ నాధ్యక్షుడికి.

అందరికీ రోషం ఆశ్చర్యం వేసింది ; వెంకట స్వామి దేశానికే ముప్పు తలపెట్టాడా ? - జపాను వాళ్ళతో కలిసి, - కొందరు దేశద్రోహులు మళ్ళీ శాంతి భద్రతలకు భంగం తీసుకురా యత్నిస్తున్నారా ?-

మేజస్ట్రేట్ తామసం చిక్కబట్టలేక,ప్రత్యేకం చెరసాలలో వెంకటస్వామిని దర్శించి, మామూలు పొరుడల్లే — 'ఇంత ద్రోహం తలపెట్టావేం ? - ఇదేనా నీ కాంగ్రెస్ సేవ ? - ' అంటూ తనకు వేసిన అసహ్యం అంతా చదివాడు:

వెంకటస్వామి, ఏ మాత్రమూ నొచ్చుకోకుండా - 'అంతే బాబూ ! ఖండఖండాంతరాల్లో ప్రఖ్యాతి కెక్కే దేశద్రోహుల్ని ఒక్క-కాంగ్రెస్ తప్ప, మరే సంస్థ తయారు చేసిందండీ ! - ' మేజస్ట్రేట్ ఇది తప్పుడు మాట అని గద్దించాడే కాని ఎలా తిప్పికొట్టాలో తెలియక - యావత్తు సర్వీసులోనూ ఎన్నడూ కాంగ్రెస్ అంటే అభిమానం చూపించవలసిన అగత్యం రానందువల్ల — 'సరే నీ కర్మం నీది!' అన్న చూపుతో చేతులు దులుపుకున్నాడు.

హేమాహేమీ లందరూ వెంకటస్వామిని పట్టుకుని నిగ్గదీశారు: అతనికీ జపానుకీ ఉన్న లావాదేవీ తేల్చాలని అన్న-పానాలు మాని, కంటి మీద కునుకు మాని-రాచి రంపాన పెట్టారు. చేసిన నేరం చెప్పేసి-గుట్టు బయట పెడితే,-తనకుమాత్రం, ఏ యావజ్జీవ శైదుతోనో పోయేట్టు శాయశక్తులా కనికరిస్తామని అభయం యిచ్చారు.

'సరే చెపుతా'నన్నాడు-వెంకటస్వామి-కాయితం కలం అంది పుచ్చుకుని,-తెలుగులో వ్రాసి యిచ్చాడు. తెలుగువచ్చిన అధికారి,-అది చూసి ఉప్పెన వచ్చినట్టు పకాల్ మన్నాడు.- వెంకటస్వామి ఉత్తరక్షణంలో విడుదల అయినాడు. ఊరంతా మరీ చిత్తరపోయింది. ఎలాగో తెలిసిన ఒకరో అరో స్వగతంగా నవ్వుకున్నారు. ఈ గుట్టు వెల్లడి అయితే పెద్ద హోదాలవాళ్ళ ఆబోరు దక్కదని, గోప్యంగానే ఉంచాడు వెంకటస్వామి: గవర్నర్ జనరల్‌కు మాత్రం ఒక్క విజ్ఞప్తి అనుపుకున్నాడు: అందులో ముఖ్య విషయం-

'...ప్రభుత్వంవారు మద్యపాననిషేధం ప్రసాదించినంతమాత్రాన దేశం నిమిషంలో సుభిక్షంలోకి వ్రాలదు: త్రాగుడు మానేసి కాఫీలు టీలు త్రాగమని ఎంత ప్రచారం చేసినా- ఆ ఘాటూ నిషాలకు అలవాటుపడ్డ ప్రాణి-వీటితో పెదవులు కాల్చుకోడు. కనుక, వాళ్లజిహ్వకు అలవాటుపడ్డ గుణాలన్నీ ఉండి, కేవలం ఒక మత్తేకాకుండా సత్తువకూడా యిచ్చే పదార్థం అయి ఉండాలి. అది పేదకూ బిక్కికీ అందుబాటులో ఉండాలి:

అయితే యీ చిదంబర రహస్యం బట్టబయలు చేసి- ఇలా నిత్యమూ పుచ్చుకోమని పురమాయిస్తే- 'ఓష్ యిదేనా!' అని ఏ ఒక్కడూకూడా దాన్ని సేవించడని,- ఇలా గోప్యంగా, ఖర్చు మొత్తం నేనే భరించి, యథాశక్తి ప్రభుత్వం తలపెట్టిన ఉద్యమానికి ఉడతాభక్తి చేస్తున్నాను: యిది సాంగంగా పరిశీలించి మీ దీవెనలు తమ కార్యదర్శి ద్వారా ప్రసాదించమని వేడుకుంటున్నాను. సర్వజ్ఞులైన తమకు నేను, తరవాణి గుణగతాల్ని యింతకు మించి మనవి చేయనక్కరలేదని సెలవు అందుకుంటున్నాను-'

Source: Press Academy Website, Telugu Swatantra Magazine, Dec 1948

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Malladi Ramakrishna Sastri gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/